క్లుప్తంగా

స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ


స్టేట్ బ్యాంక్ మేనేజర్ రాజు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌గా బి.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దేవరపల్లి బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చానన్నారు. వ్యాపారాలు, వ్యవసాయ అభివృద్ధికి బ్యాంక్ తరపున నాణ్యమైన సేవలు అందిస్తానని వివరించారు. ప్రస్తుత మేనేజర్ వెంకటయ్య మరో బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. అనంతరం ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉపాధి హామీ తనిఖీలపై నివేదిక విడుదల

చాగల్లు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీలపై బుధవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన పనులకు 18వ విడతగా 2025 జూన్ 28 నుంచి జూలై 14 వరకు నిర్వహించిన సామాజిక తనిఖీపై నివేదికను చాగల్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించి, నివేదికను సమర్పిస్తామని ఆమె వెల్లడించారు. కావున మండల ప్రజా ప్రతినిధులు, సంబంధిత డివిజనల్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు, మేట్‌లు, హాజరు కావాలని ఆదేశించారు.

ఉపాధ్యాయుడిపై డీవైఈవో విచారణ

ఉండ్రాజవరం: మండలంలో చిలకపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రామచంద్రరావు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, బిల్డర్‌గా తన సొంత పనులు చేసుకుంటున్నట్లు ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీవైఈవో మురళి సత్యనారాయణ పాఠశాలకు విచ్చేసి విచారణ చేపట్టారు. రామచంద్రరావు స్కూల్ పనివేళల్లో సరిగా ఉండటం లేదనే ఆరోపణలకు సరైన ఆధారాలు లేక పోవడంతో ఆయనకు మొదటి హెచ్చరిక జారీ చేస్తున్నట్లు తెలిపారు. మరోసారి ఇటువంటి పొరపాటు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనా రాజు, శారద జ్యోత్స్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెరవలి: మండలంలోని మల్లేశ్వరం, ఖండవల్లి ఫీడర్లపై విద్యుత్ లైన్‌లో చెట్లు కొమ్మల తొలగింపు కారణంగా రెండు ఫీడర్లను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ ఎస్ నారాయణ అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని దీనిని వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా అందిస్తామని వివరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సీటీఆర్ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వెలిడేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా నష్టపోతారన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా 8వ పేకమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో ఓ సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. నిరసనలో నగర యూనిట్ అధ్యక్షుడు కేకే సంజీవరావు, సహాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలి

రాజానగరం: పాఠశాలలో పిల్లలకు మూడో తరగతి చివరి నాటికి చదవడం, రాయడంతో పాటు సంఖ్యలతో పరిజ్ఞానాన్ని సాధించేలా వారిలో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవ రావు అన్నారు. స్కూల్ లీడర్షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు మండలంలోని మల్లంపూడి, సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను వృద్ధి చేయడంతోపాటు, విద్యార్థుల సంఖ్యను కూడా పెంపొందించే దిశగా ప్రయత్నించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి పెట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం చేయాలన్నారు.

దండిగా దిగుబడి..కొనేవారేరీ

- పెట్టుబడులు రాక కౌలు రైతుల కుదేలు
- ఎకరాకు రూ.2 లక్షల నష్టం
- చేలల్లోనే దుంప..మొలకలు వస్తున్న వైనం
- భూములు ఇవ్వాలని కౌలు రైతులపై ఒత్తిడి


పల్లంట్లలో అమ్మకానికి సిద్ధం చేసిన పెండలం దుంపలు


కొనుగోళ్లు లేక రాసిలోనే మొలకలు వస్తున్న పంట

దేవరపల్లి: పెండలం రైతులు నష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు. పంటకు గిట్టుబాటు ధర లేక పోవడం, కొనుగోళ్లు మందగించడం, దిగుబడులు తగ్గడంతో సాగు చేసిన రైతులు అయోమయంలో ఉన్నారు. కౌలు దారుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట భూమిలోనే ఉండిపోయి మొలకలు రావడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు దుంప కుళ్లిపోవడంతో మూలిగే నక్కపై తాడికాయ పడినట్టు అదనపు పెట్టుబడి భారం పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా జూన్, జూలై నెలల్లో పెండలం సాగు ఆరంభిస్తారు. తయారైన దుంపను జనవరి నుంచి మే నెల మధ్య భూమి నుంచి తవ్వి తీస్తారు. వాతావరణం అనుకూలిస్తే దుంప బరువు సుమారు 2 నుంచి 5 కిలోలు ఉంటుంది.

కూలి రావడంలేదు

ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తోంది. ఈ ఏడాది దిగుబడులు ఎకరాకు 7 నుంచి 8 టన్నులు వస్తోందని రైతులు తెలిపారు. ధర 10 టన్నులు రూ.40 వేలు పలుకుతుందని రైతులు వివరించారు. దుంప తీత కూలి ఖర్చులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. మొలకల నివారణ మందుకు ఎకరాకు రూ.5 వేలు ఖర్చవుతుందని తెలిపారు. వర్షాలకు దుంప మొదలు కుళ్లిపోవడంతో పంట దెబ్బతిందని వాపోతున్నారు.

కౌలు రైతులకు దెబ్బ

చేలల్లోని దుంప భూమిలోనే ఉందని, భూమి కౌలు గడువు దాటిపోవడంతో భూముల యజమానులు కౌలు దారులను ఒత్తిడి చేస్తున్నారు. మే నెల చివరి నాటికి భూములను ఖాళీ చేసి యజమానులకు అప్పగించవలసి ఉంది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు పంట దిగుబడి వస్తోంది. జూన్ నెలలో భూములను రైతులకు అప్పగిస్తే వచ్చే ఏడాదికి తిరిగి కౌలుకు ఇస్తారు. వచ్చిన కాడికి అమ్ముకుని భూములను ఖాళీ చేసి పోదామంటే దుంప కొనే నాధుడు కనబడడంలేదని రైతులు వాపోతున్నారు.

పల్లంట్ల దుంపకు డిమాండ్

పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో పండించన పెండలం దుంపకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. దుంప మంచి సైజు, నాణ్యత ఉంటుంది. 2 నుంచి 5 కిలోల దుంప తయారవుతుంది. పల్లంట్ల గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో పంట వేశారు. ఇక్కడ పండిన పంటను రావులపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి ఒడిశాకు ఎగుమతి చేస్తారు.

ఒడిశాకు ఎగుమతులు

ఒడిశాకు పెండలం వినియోగం ఎక్కువగా ఉంటుంది. పూరి జగన్నాధస్వామి యాత్రకు పెండలానికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. యాత్ర సందర్భంగా సుమారు 100 లారీల(1,000 టన్నుల) పెండలం విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది యాత్ర సందర్భంగా గిరాకీ లేకపోడంతో ఎక్కడ పంట అక్కడే ఉండి పోయింది. దీనితో పాటు ఒడిశా ప్రాంతంలో కూడా రైతులు ఈ ఏడాది పెండలం పంట సాగు చేయడంతో ఇక్కడ పెండలానికి డిమాండ్ తగ్గినట్టు వ్యాపారులు చెపుతున్నారు. ఒడిశాలో పెండలాన్ని వివాహాలకు ఎక్కువగా వినియోగిస్తారని, ప్రతి ఇంటికి 10 నుంచి 20 కిలోల దుంపలను సారేగా పంచిపెడతారని రైతులు వివరించారు. ఈ ప్రాంతంలో పండిన ప్రతి కిలో దుంప అక్కడికే వెళుతుందని రైలులు తెలిపారు. ఈ ఏడాది స్థానికంగా రైతులు పెండలం సాగు చేయడంతో పాటు అక్కడ వినియోగం తగ్గడం వల్ల డిమాండ్ తగ్గినట్టు సమాచారం.

20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా..



దుంప భూమిలోనే ఉండిపోవడంతో మొలకలు వస్తున్నాయి. 20 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట వేశాను. ఎకరాకు సుమారు రూ.30 వేలు వస్తోంది. కౌలు, పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. వచ్చిన కాడికి అమ్ముకుని చేలు ఖాళీ చేద్దామంటే అడిగిన నాధుడు లేడు.

– ఈదుపుగంటి వర ప్రసాద్, కౌలు రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

మూడింట రెండొంతుల నష్టం



పది ఎకరాలు కౌలుకు తీసుకుని పెండలం పంట వేశాను. ఇటీవల దుంపను తీసి అమ్మగా 10 ఎకరాలకు 100 టన్నులు దిగుబడి వచ్చింది. వచ్చిన ఆదాయం రూ. 4 లక్షలు కాగా, పెట్టుబడి, కౌలు కలిపి మొత్తం రూ. 12 లక్షలు అయింది. రూ. 8 లక్షలు నష్టం వచ్చింది.

– నూతలపాటి వెంకటరమణ, రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

రజకుల చెరువులను పరిరక్షించండి

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని పశివేదల గ్రామంలో మంగళవారం జిల్లా రజక కులస్తుల నేతలు పర్యటించారు. గ్రామంలోని రజకుల చెరువు ఆక్రమణలపై పంచాయతీ సర్పంచ్ తుంపల్లి సింహాచలానికి, కార్యదర్శి భూపతి, ఎంపీటీసీ సభ్యులు కరిమర్తి బాలకృష్ణలకు జిల్లా నేతలు వివరించి సమస్య పరిష్కారించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం గ్రామంలోని చెరువులని పరిశీలించి ఆయన మాట్లాడుతూ పశివేదల గ్రామంలో రజకులకు కేటాయించిన చెరువు ఇప్పటికే ఆక్రమణలకు గురయ్యి విస్తీర్ణం తగ్గిపోయిందని, తాజాగా చెరువులో కొంత భాగాన్ని పూడ్చి రోడ్డు నిర్మిస్తున్నారనే ప్రపోజల్ వచ్చిందని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. రజకులకు కేటాయించిన చెరువు విషయంలో నిర్మాణాలు చేస్తే ఊరుకోమని, అవసరమైతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోటిచుక్కల నాగేశ్వర రావు, కార్యదర్శి రాచకొండ అమ్మిరాజు, కోశాధికారి బూరుగుపల్లి శ్రీనివాస్, కాకరపర్తి చినవెంకట్రావు, స్థానిక రజకనేతలు, జిల్లా నేతలు ఉన్నారు.


చెరువు ఆక్రమణలపై వినతిపత్రం ఇస్తున్న రజక సంఘ నాయకులు

సహేతుకంగా ఆర్వోబీ పనులు చేపట్టాలి

- నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్
- పొలాల ముంపుపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

నిడదవోలు: నిడదవోలు ఆర్వోబీ నిర్మాణ పనుల నేపథ్యంలో పనులను రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం క్షేత్ర స్థాయిలో కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. ఆమె వస్తున్న సమాచారంతో పలువురు స్థానిక రైతులు కలిసి పలు అంశాలను విన్నవించారు. సాధారణంగా పశ్చిమడెల్టాకు 6,500 క్యూసెక్కులు విడుదల చేయాల్సి ఉండగా రాత్రి సమయంలో 7,500 క్యూసెక్కులు వదలడంతో నిడదవోలు, చాగల్లు మండలాల్లో పలుచోట్ల గట్లు బలహీనంగా ఉండటంతో సుమారు 1,000 ఎకరాల ఆయకట్టు నీట మునిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గట్లను పటిష్టపరిచి డెల్టా శివారుకు ఎంత నీరయినా వదులుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసే క్రమంలో రైతులు అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కార మార్గాలను చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్వోబీ నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అదే సమయంలో రైతుల పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణుల బృందం ఆర్డీవో, రైల్వే ఇంజినీరు, ఇరిగేషన్, జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి మరోసారి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ రాణిసుస్మిత, వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, ఆర్అండ్‌బీ ఈఈ రూప్ కుమార్, డీఈ బి.వెంకటరమణ, తహసీల్దార్లు బి.నాగరాజునాయక్, ఎమ్. మెరికమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఆర్వోబీ వద్ద కాలువలో మట్టి దిబ్బలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పంట స్వీయ నియంత్రణను పాటించాలి

దేవరపల్లి: పొగాకు పంట స్వీయ నియంత్రణను తప్పనిసరిగా పాటించి, పరిమితికి లోబడి సాగు చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ రైతులకు సూచించారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్డు కార్యాలయంలో ఆయన రైతులతో మాట్లాడారు. 2025–26 పంట కాలానికి బోర్డు అనుమతించిన మేరకు పంట పండించి అంతర్జాతీయ మార్కెట్లో వర్జీనియా పొగాకు విలువను కాపాడుకోవాలన్నారు. 2024–25 పంట కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 16 వేలం కేంద్రాల ద్వారా 167 మిలియన్ల కిలోల ఉత్పతికి అనుమతి ఇవ్వగా, దాదాపు 243 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగిందన్నారు. దీనికి లోబడి పంటను పండించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో మన పొగాకుకు పోటీగా అనేక దేశాల్లో పంట పండిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో పొగాకు పంట పండేదని. ప్రస్తుతం 5,6 దేశాలు పోటీపడబోతున్నట్టు తెలిపారు. ఆఫ్రికా దేశాల నుంచి పెద్ద ఎత్తున పోటీ ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు స్వీయ నియంత్రణ పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి. హేమస్మిత, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.


దేవరపల్లి కేంద్రంలో వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

తాడిపూడి కాలువకు నీటి విడుదల

దేవరపల్లి: తాడిపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రధాన కాలువకు అధికారులు మంగళవారం ఖరీఫ్‌కు నీటిని విడుదల చేశారు. ప్రధాన పంపు హౌస్ వద్ద ఎనిమిది మోటార్లతో గోదావరి నీటిని ఎత్తిపోసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో దాదాపు 2.06 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవలసి ఉండగా, ఈ ఏడాది సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడానికి అధికారులు ప్రణాళిక తయారు చేసి ఈ నెల 3వ తేదీని తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన పంపు హౌస్ వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని విడుదల చేశారు.

సాక్షి ఇంపాక్ట్

మరమ్మతుల కారణంగా..

దేవరపల్లి వద్ద సబ్‌లిఫ్ట్ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో మోటార్లను నిలుపుదల చేశారు. దీనిపై రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ నెల 14వ తేదీన 'మడి..తడారి' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సబ్ లిఫ్ట్ మరమ్మతులను పూర్తి చేసి సోమవారం రాత్రి కాలువకు నీరు విడుదల చేశారు. ఇరిగేషన్ డీఈఈ రామేశ్వరనాయుడు మాట్లాడుతూ మూడు మోటార్ల ద్వారా 500 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఆయన వివరించారు. సబ్‌లిఫ్టులు ప్రారంభించాక అవసరాన్ని బట్టి మోటార్లను పెంచుతామన్నారు.


తాడిపూడి ప్రధాన కాలువలో పారుతున్న గోదావరి నీరు

పశ్చిమ డెల్టాకు 6,800 క్యూసెక్కులు

నిడదవోలు: జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు మంగళవారం నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం ఖరీఫ్ వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ దశలో నీటి అవరాలు ఎక్కువగా ఉంటోంది. విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి మంగళవారం అత్యధికంగా 6,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నరసాపురం కాలువకు 2280 క్యూసెక్కులు, తణుకు కాలువకు 930 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1251 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1544 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 582 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

రాజమహేంద్రవరం రూరల్: ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 30 శాతం నుంచి 67 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలు ఇస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. లాలాచెరువు ఆప్కో విక్రయ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆప్కో మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల్లో ఒకటైన చేనేత వస్త్రాలను తయారు చేయడం ద్వారా అనేక మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. చేనేత వస్త్రాలు శరీరానికి హాయిని కలిగించడమే కాకుండా ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం వస్త్రాలను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీలకు సర్వర్ ఇక్కట్లు

- మెషీన్ మొరాయింపుతో తప్పని తిప్పలు
- కిట్ల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు


తల్లులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న సిబ్బంది

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార పంపిణీకి ఏర్పాటు చేసిన ఫేషియల్ రికగ్నేషన్ సర్వర్ మొరాయింపు కారణంగా తరుచూ ఇబ్బందులు పడుతున్నట్టు లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రతి నెల మొదటి, మూడో శుక్రవారాలలో గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని, కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాక్ యాప్‌లు ఏర్పాటు చేశాయి. ఈ యాప్‌లలో నమోదు తర్వాతే కిట్లను అందించాల్సి ఉంటుంది. సర్వర్ సమస్య కారణంగా అంగన్‌వాడీలకు పలుమార్లు తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నేషన్‌లో గుర్తింపు కాకున్నా రిజిష్టర్‌లో సంతకం పెట్టించుకొని సరుకులు అందించేవారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల నుంచి ఫేషియల్ రికగ్నేషన్‌ను తప్పనిసరి చేసింది. ఇందులో సాంకేతిక సమస్య కారణంగా లబ్ధిదారులు గంటల కొద్దీ కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. బాలసంజీవని యాప్‌లో పోషకాహారం వివరాలు నమోదు చేసి లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నేషన్ గుర్తింపు నమోదు ప్రయత్నిస్తే ప్లీజ్ కాంటాక్ట్ అడ్మినిస్ట్రేషన్ అని చూపుతోందని, కొన్ని కేంద్రాలలో సరుకులు నిల్వ ఉన్నా లేనట్టు చూపడంతో లబ్ధిదారులకు సరుకులు ఉన్నా ఆ సమయంలో ఇవ్వడం సాధ్యం కావడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ఫేషియల్ రికగ్నేషన్ వివరాలు లబ్ధిదారులకు సరుకులు అందించేటప్పుడు తీసుకునే ఫేషియల్ రికగ్నేషన్ సరిపోలడం లేదని పోషణ్‌ట్రాక్ యాప్‌లోను ఈకేవైసీ నమోదులోను జాప్యం జరుగుతోందని తరుచూ ఎర్రర్‌అని చూపుతున్నట్టు పలువరు వివరించారు. సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో అనధికార వేడుకలు


సమాఖ్య కార్యాలయంలో శేషారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పుష్పావతి, టీడీపీ నాయకులు

నిడదవోలు రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనకు పనిచేయాల్సిన మండల సమాఖ్య అధ్యక్షురాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పుట్టినరోజు వేడుకలను మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుట్టిన రోజు వేడుకలకు వచ్చే వారంతా కచ్చితంగా పసుపు చీర కట్టుకుని రావాలని అధ్యక్షురాలు నల్లూరి పుష్పావతి ఫోన్ చేసి చెప్పినట్లు తెలుస్తోంది. నేరుగా ఆమె పసుపు చీర కట్టుకుని పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడంతో పాటు వీవోఏలకు చీరలు పంపిణీ చేసి శేషారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల సమాఖ్య అధికారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అత్యుత్సాహం చూపించారు. తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మహిళ నేత నల్లూరి పుష్పావతిని నిడదవోలు మండల సమాఖ్య అధ్యక్షురాలిగా నియమించినప్పటి నుంచి ఆమె వ్యవహారశైలితో సంబంధిత అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. నిడదవోలులో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లో కూడా అధికారులకు సంబంధం లేకుండా అక్రమంగా పలుమార్లు రాత్రి వేళల్లో విక్రయాలు జరిపిస్తున్నట్లు డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. మండల సమాఖ్య అధికారులు కూడా ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుని ఆమె చెప్పిన ఆదేశాలకు తల ఊపుతున్నారు. కూటమిలో ఉన్న టీడీపీకి పెద్దపీట వేస్తూ జనసేన నాయకులను ఆమె పట్టించుకోవడంతో ఆ పార్టీ నేతలే స్వయంగా మంత్రి కందుల దుర్గేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

సాంకేతికతతో లాభాలను ఒడిసిపట్టాలి

దేవరపల్లి: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సాగులో నాణ్యమైన అధికదిగుబడులు పొందాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (కొవ్వూరు) చింతల శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్ పాల్గొని రైతులకు వ్యవసాయ రంగంలో సాంకేతికత, యాంత్రీకరణ వ్యవసాయ పద్ధతులను ఆయన రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించాలని ఆయన సూచించారు. జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ పంటలు ఆరోగ్యంగానే ఉన్నాయని, కాండం తొలిచే పురుగు అక్కడక్కడ కనిపిస్తోందన్నారు. నివారణకు నారుమడిలో మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, వీఏఏ వీరాస్వామి, అభ్యుదయ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై మహిళల నిరసన

నిడదవోలు: పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఎం ఆధ్వర్యంలో చర్చిపేటలో మంగళవారం మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఆదా పేరుతో, విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని కోరారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు వేయమని నమ్మబలికి రూ.15వేల కోట్లు విద్యుత్ భారాలు మోపిందని విమర్శించారు. నారా లోకేష్ నెల్లూరు జిల్లాలో యువగళం సందర్భంగా స్మార్ట్ మీటర్లు ధ్వంసం చెయ్యండి అంటూ పిలుపునిచ్చారు. తీరా అధికారం చేపట్టాక స్మార్ట్ మీటర్లతో పాటు పెంచిన విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ఇదే ధోరణి కొనసాగితే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని ఆయన హెచ్చరించారు.

గుబ్బాలమ్మ ఆలయానికి రూ.1.96 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్ తెలిపారు. తాడేపల్లిగూడెం దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో గుబ్బాలమ్మ ఆలయ హుండీని లెక్కించగా 128 రోజులకు రూ.1,96,959 ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంచదార దుర్గాప్రసాద్, నాయకులు ఆరేపల్లి చిన నంగాలు, నీలం శ్రీనివాస్, అడ్డగర్ల కృష్ణ, వి.సూర్యచంద్రరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I **MOHAMMED GOUSE** (Old Name) S/o. **SHAIK FARID AHMED** resident of D.No. 5-207, Kothapeta, Chagallu, East Godavari, Andhra Pradesh - 534 342. I have changed by name as **MOHAMMAD GOUSE** (New Name). Hereafter my name is known as **MOHAMMAD GOUSE** (New Name) S/o. **SHAIK FARID AHMED.**





సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com